## ఆంధ్రప్రదేశ్‌లో 638 పారిశ్రామిక పార్కులు

**- లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** దేశంలో ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక పార్కుల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటో తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం లోక్‌సభలో ఈ మేరకు పారిశ్రామిక పార్కుల అంశంపై వివరాలు ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించబడిన, నిర్మాణంలో ఉన్న, అలాగే పని చేస్తున్న పారిశ్రామిక పార్కుల వివరాలు కోరారు. గత ఐదేళ్లలో పారిశ్రామిక పార్కులలో తయారు చేయబడిన ఉత్పత్తుల విలువ ఎంతని ప్రశ్నించారు. నిర్ధిష్ట ఉత్పత్తుల తయారీ కోసం ప్రభుత్వం కేటాయించిన పారిశ్రామిక పార్కుల వివరాలు ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. పరిశ్రమల అనేవి రాష్ట్రానికి సంబంధించిన అంశమని, వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి కోసం భారత ప్రభుత్వం.. పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం(డీపీఐఐటీ) ఇతర కేంద్ర మంత్రిత్వ శాఖలు తగిన విధానపరమైన మద్దతు అందిస్తుందని చెప్పారు. ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక పార్కులకు సంబంధించిన సమాచారాన్ని సంగ్రహించడానికి డీపీఐఐటీ ఒక కేంద్రీకృత వ్యవస్థను నిర్మించిందని, దీనిలో సంబంధిత రాష్ట్రాలు క్రమం తప్పకుండా వివరాలను అప్‌డేట్ చేస్తాయన్నారు. రాష్ట్రాల వారీగా పారిశ్రామిక పార్కులు, వివిధ రంగాల వారీగా వివరాలు హెటీటీపీఎస్://ఇండస్ట్రీరియల్ అండ్ బ్యాంక్.జీవోవీ.ఇన్/ ఇక్స్‌ప్లోర్ పార్క్ రిపోర్ట్ వెబ్‌సైబ్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 4597 పారిశ్రామిక పార్కులు ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 368 పార్కులు ఉన్నాయన్నారు. తమిళనాడు(విరుధ్‌నగర్), తెలంగాణ (వరంగల్), గుజరాత్(నవసరి), కర్ణాటక(కలబురగి), మధ్యప్రదేశ్(ధార్), ఉత్తరప్రదేశ్(లక్నో), మహారాష్ట్ర (అమరావతి)లలో 7 ప్రదేశాలలో పీఎం మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజినయర్ అండ్ అప్పారెల్(పీఎం మిత్ర) పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4445 కోట్ల వ్యయం చేస్తోందని పేర్కొన్నారు.



# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## కండలేరులో 60.320 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, డిసెంబరు 9, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో మంగళవారం ఉదయానికి 60.320 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల.. కండలేరు వరద కాలువ ద్వారా 1550 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వస్తుండగా జలాశయం నుండి హైలెవల్ కెనాల్ ద్వారా 70 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 930 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1050 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## గ్రామ అభివృద్ధి కోసం పిసిబి ఛైర్మెన్ సేవలు

**జిల్లా కలెక్టర్ హిమన్షుశుక్ల**





**కొడవలూరు, డిసెంబర్9 ప్రభాతవార్త :** సమగ్ర అభివృద్ధి పట్ల జన్మించిన గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రిటైర్డ్ కలెక్టర్ ఏపిపిసి బి.ఛైర్మెన్ పి.క్రిష్ణయ్య వివిధ కార్యక్రమకాలు చేయడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ హిమన్షుశుక్ల పేర్కొన్నారు. కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామానికి కలెక్టర్ రావడంతో మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేద మంత్రాలతో అర్చకులు పూజలు నిర్వహించి కలెక్టర్‌కు స్వామిని దర్శింపచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. సమగ్ర అభివృద్ధి కార్యక్రమం ఏర్పాటు సందర్భంగా ఏపిపిసిబి ఛైర్మెన్ పి.క్రిష్ణయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి చెందాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే లక్ష్యమన్నారు. పొలాలు, డొంక ఏర్పాటు, ఇండ్లస్తలాలు, వివిధ సమస్యలపైప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్రిష్ణయ్య ఎప్పుడైనా ఫోన్‌లైన్ ద్వారా సంప్రదించి మాట్లాడితే గ్రామంలో పనులు చేయాలని అడిగి వారి తప్ప ఆయన సొంత విషయాలు గురించి మాట్లాడే వారు కాదని కొనియాడారు. పిల్లలను బాగా చదివించండి జిల్లాకి రెండు, మూడు సంవత్సరాల్లో మంచి ప్యాక్టరీలు, ఇండస్ట్రీలు ఏర్పడుతాయని తెలిపారు. దీంతో ఎన్ని ఉద్యోగ అవకాశాలు ఉంటాయని అన్నారు. జిల్లాలో రామయపట్టణం ఇండస్ట్రీహబ్‌గా ఏర్పడుతున్నదని అదే విధంగా ముఖ్యమంత్రి బిపిసిఎల్ కంపెనీని మహారాష్ట్రానికి వెళ్ళనీయకుండా ఏపికి అన్ని విధాలుగా ముందుంటామని చెప్పి కంపెనీని తీసుకురావడం జరిగిందని తెలిపారు. బిపిసిఎల్ కంపెనీల్లో 5వేల మంది వస్తారు వారిలో బయట వారు కొంతమంది ఇక్కడవారు ఉంటారని తెలిపారు. తద్వారా నూతన స్కూల్స్, ఆసుపత్రులు ఇంకా మరెన్నో ఏర్పడుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా గంగాభవాని, జిల్లా అగ్రికల్చరల్ అధికారి సత్యవాణి. జడ్పి సిఈఓ మోహన్‌రావు, జిల్లా పంచాయితీ అధికారి వసుమతి, జిల్లా విద్యాశాఖాధికారి బాలాజిరావు, స్థానిక తహశీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి, ఎంపిడిఓ వెంకటసుబ్బారావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాపూరు పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఐజి సర్వ శ్రేష్ఠి త్రిపాఠి



**రాపూరు, డిసెంబరు 9ప్రభాతవార్త** రాపూరు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్టి త్రిపాఠి, నెల్లూరు జిల్లా అజిత వెజండ్లతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులు తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నేరాలకు సంబందించిన విషయాలపై అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్, రాపూరు సిఐ సత్యనారాయణ, ఎస్ఐ వెంకట రాజేష్, ఎఎస్ఐ వెంకటేశ్వర రావు సిబ్బంది వున్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు ఎస్ఐ జిలానీ ప్రత్యేక చర్యలు



**ఆత్మకూరు, డిసెంబరు 9 ప్రభాతవార్త** : ఆత్మకూరు పట్టణంలో ఎస్ఐ జిలానీ తన సిబ్బందితో మంగళవారం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంతం నుండి సత్రం సెంటర్ వరకు రోడ్డుకిరువైపులా ఉన్న వాహనాలను తొలగిస్తూ ట్రాఫిక్‌కు అడ్డం లేకుండా పెట్టుకోవాలని ఆప్రాంత వాహనదారు లకు, షాపుల నిర్వాహకులకు సూచించారు. ట్రాఫిక్‌కు అడ్డంగా ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ జిలానీ హెచ్చరించారు.

## ముంపుకు గురయ్యే కాలువలపై ప్రత్యేక దృష్టి సారించండి

**- జేసీ ఎం. వెంకటేశ్వర్లు**



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** కార్పొరేషన్ పరిధిలో ముంపుకు గురవుతున్న కాలువలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. జెసి ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో నగర కార్పొరేషన్ కమిషనర్ నందన్, ఆర్డీఓ నాగ అనూష, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్నాయక్, రెవెన్యూ అధఇకారులతో మంగళవారం నగర కార్పొరేషన్ పరిధిలోని డ్రైనేజీ సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపుకు గురవుతున్న కాలువలకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్, కార్పొరేషన్ అధికారులు సర్వే నిర్వహించాలని అన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో గల ఇరిగేషన్ కాలువల పరిస్థితిపై సమగ్ర సర్వే చేపట్టి సమస్యలను తెలుసుకోవాలన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో దుస్థితిలో ఉన్న పంట కాలువలు సర్వే చేపట్టి అందుకు అవసరమైన ప్రతిపాదనల సిద్ధం చేయాలని అన్నారు. ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్, ఏఈలు, ఎన్ఎంసీ కమిషనర్, సెక్షన్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారి, నెల్లూరురూరల్, అర్బన్ తహశీల్దార్లు, ఇరిగేషన్ డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## టెట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు : డీఆర్ఓ ఎన్. విజయ్ కుమార్



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** జిల్లాలో నేటి నుంచి 21 వరకు జరగనున్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్లో డీఆర్ తన ఛాంబర్ లో టెట్ పరీక్షల సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆర్డీవో నాగ అనూష తో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పదో తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లాలో 10,645 యువతీ యువకులు టెట్ పరీక్షలకు హాజరు కానున్నారు. జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాల ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సంబంధించి బందోబస్తు, విద్యుత్తు, రవాణా, కేంద్రాల వద్ద మౌలిక వసతుల ఏర్పాట్లలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ బాలాజీ రావు, సమన్వయ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

## రిలేనిరాహారదీక్షలు ప్రారంభించిన కలువాయి ప్రజలు





**కలువాయి డిసెంబర్ 9 ప్రభాతవార్త** ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఉండే కలువాయి మండలాన్ని గూడూరు డివిజన్ తిరుపతి జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వ గెజిట్ విడుదల చేసినప్పటి నుండి కలువాయి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఈక్రమంలో మండలంలోని అన్ని వర్గాలకు సంబందించిన ప్రజలు విడుదలైన గెజిట్‌ను వ్యతిరేఖిస్తు కలువాయి మండలాన్ని ఆత్మకూరు డివిజన్‌లో,నెల్లూరు జిల్లాలో కొనసాగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గత నెల 29 నుండి ప్రజలు చేస్తున్న పలు దీక్షలు ,ర్యాలీలు నిరసనలు తారాస్థాయికి చేరాయి. మంగళవారం నుండి రిలే నిరాహారదీక్షను స్థానిక బస్టాండ్ కూడలి నందు ప్రారంభించారు. వ్యాపారస్తులు,ఉద్యోగ సంఘా ల నాయకులు,రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్దఎత్తున మండల వ్యాప్తంగా రిలే నిరాహరదీక్షలో పాల్గొని సేవ్ కలువాయి అంటు నినాదాలు చేశారు.

**ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్తా : కురుగొండ్ల**

కలువాయి సేవ్ నినాదంతో మండలంలో జరుగుతున్న ఆందోళనలను వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకొని వెళ్ళేందుకు మంగళవారం తెలుగుదేశం పార్టీ మండలాద్యక్షులు చల్లా రఘురామిరెడ్డి ఆద్వర్యంలో టిడిపినాయకులు జెఏసి నాయకులు గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లారు. శాసనసభ్యులను కలిసి ప్రభుత్వం నుండి విడుదలైన గెజిట్ ప్రజలకు అసౌకర్యంగా ఇబ్బంది కరంగా ఉండడంతో ఇందుకు వ్యతిరేఖంగా మండలంలో చేస్తున్న నిరసనలను ప్రజా వ్యతిరేఖ సంతకాలను, వినతి పత్రాలను కురుగొండ్లకు అందజేశారు.తన దృష్టికి వచ్చిన ఈవిషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళతానని న్యాయం చేకూరే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు అధికార పార్టీనాయకులు తెలిపారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పనిసరి

**- గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి - జిల్లాలోని పలు స్టేషన్లను తనిఖీ చేసిన ఐజి**



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 9, ప్రభాతవార్త :** నగరంలోని వేదాయపాలెం, నెల్లూరు రూరల్‌తో పాటు పొదలకూరు రాపూరు పోలీసు స్టేషన్‌లను గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి, జిల్లా యస్.పి. అజిత వేజెండ్లతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌ల మ్యాప్‌లను పరిశీలిస్తూ, స్టేషన్స్ పరిధిలో ఉన్న పరిస్థితులు, నేర ప్రాంతాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులు, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా ఐజి మాట్లాడి, వారి సమస్యను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుదారుని మర్యాదపూర్వకంగా పలకరించి, వారి సమస్యలను ఓపిగ్గా విని, పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్, ల్యాండ్ గ్రాబర్స్‌పై నిరంతరం నిఘా ఉంచాలని, వారి కదలికలపై ఇంటెలిజెన్స్ సేకరించి, లా అండ్ ఆర్డర్‌కు హాని కలిగించే ప్రయత్నాలు ఉంటే వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజా సేవించే వారు, అమ్మే వారిపై కఠినంగా కేసులు నమోదు చేసి నెట్‌వర్క్‌ను పూర్తిగా నిరోధించాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్పాట్‌లను గురించి, రోడ్డు భద్రత నియమాల గురించి వాహనదారులతో పాటు పట్టణ, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రేవ్ క్రైమ్స్, ప్రాపర్టీ ఆఫెన్స్ కేసులపై వేగవంతంగా విచారణ జరపాలని ఆదేశించారు. దొంగతనం కేసుల్లో కోల్పోయిన సొత్తును త్వరగా రికవరీ చేసి బాధితులకు తిరిగి అందించాలని, రికవరీ రేటు పెరగాలని, దొంగల గ్యాంగ్స్‌పై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా మహిళలను, వ్యాపారులను, సెలబ్రిటీలను బ్లాక్‌మెయిల్ చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని, స్టేషన్ సిబ్బంది యోగ క్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని వారి గ్రీవెన్స్‌ను అడిగి, వెంటనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో ఆయన వెంట జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న డ్రైవ్

**- దిశానిర్దేశ చేస్తున్న జిల్లా యస్‌పి డా. అజిత వేజెండ్ల**





**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 9, ప్రభాతవార్త :** రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల చర్యలపై నిఘా తీవ్రతరం చేయాలని, అర్ధరాత్రి వేళలో ప్రత్యేకంగా టౌన్ పరిధిలో రౌడీయిజం, దౌర్జన్యాలను నిర్మూలనకు వాహనాల తనిఖీ చేపట్టి సమగ్ర చర్యలు తీసుకునేలా జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల పోలీస్ అధికారులను సిబ్బందిని ఆదేశిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో భాగంగా, రాత్రి పూట వాహనాల తనిఖీని తీవ్రతరం చేసి, రౌడీయిజం, దౌర్జన్యాలు, దోపిడీ, దొంగతనాల నిర్మూలించాలని, రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘీక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయుటకు డ్రైవ్ నిర్వహించాలనే ఆమె ఆదేశాల మేరకు, అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సూచనలతో, సోమవారం రాత్రి 10 గంటల నుండి రాత్రి ఒంటి గంట వరకు అన్ని కూడళ్ళు, హైవే ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో డ్రైవ్ నిర్వహించి, విస్తృతంగా తనిఖీ చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా వాహనాలు తనిఖీ చేసి, ఓపెన్ డ్రింకింగ్ 59 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ 45 కేసులు, 231 ఇ చలానా కేసులు నమోదు చేసి రూ.1,42,035లు జరిమానా విధించారు. జిల్లా ప్రజలకు భద్రత, భరోసా పెంపొందించడం, రాత్రి సమయాల్లో రోడ్లపై శాంతిభద్రతలు నెలకొల్పడం లక్ష్యంగా జిల్లా పోలీసులు సమగ్ర చర్యలు చేపడుతున్నారు. రాత్రి వేళల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతుల్ని చేసే రౌడీలపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## రాపూరు మండలంలో పక్కదారి పడుతున్న యూరియా పంపిణీ

**రాపూరు, డిసెంబరు 9, ప్రభాతవార్త** ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో యూరియా కోరత ఎక్కువగా వుండటంతో ప్రభుత్వం స్పందించి రైతులకు యూరియా కోరత తీర్చాలన్న సంకల్పంతో యూరియా పంపిణీ రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నప్పటకి కోంత మంది సిబ్బంది చేతివాటంతో ఆ యూరియా రైతులకు చేరకుండా పక్కదారి పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గత శనివారం జోరేపల్లి పంచాయితీకి యూరియా లోడు రాగా సోమవారం దానిని పంపిణీ చేసేందుకు అధికారులు రైతులకు స్లిప్పులు రాసి అందుకు సంబందించిన మొత్తం తీసుకున్నారు. అయితే మంగళవారం ఉదయం డబ్బులు చెల్లించిన రైతులు వెల్లి తమకు ఇవ్వవలసిన యూరియా బస్తాలు ఇవ్వమని కోరగా అందుకు ఈ సేవా కేంద్రంలో పని చేస్తున్న వ్యవసాయ సహాయకుడు యూరియా పంపిణీలో ఎక్కడో పోరపాటు జరిగిందని మీ దగ్గర తీసుకోన్న అన్ని బస్తాల యూరియా లేదు, అందువల్ల మీకు అన్ని బస్తాల యూరియా ఇవ్వలేము అంటూ నగదు తీరిగి ఇచ్చిన్నట్లు రైతులు చెపుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అందుకు వ్యవసాయ సహాయకుడు సమాధానం ఇవ్వకుండా వెల్లిపోయినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారిని వివరణ కోరగా ఆయన సరైన సమాదానం ఇవ్వకుండా ఈ సారి వచ్చినప్పుడు యూరియా ఇస్తామని చెప్పడం జరిగింది. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయాధికారులు స్పందించి ఇప్పటి వరకు రాపూరు మండలంలో యూరియా ఎంత పంపిణీ చేశారు. అది నిజమైన రైతులకు పంపిణీ చేశారా లేక ఆ యూరియా పక్కదారి ఎమైనా పట్టిందా అని విచారణ నిర్వహించి, అర్హులైన రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## యుటిఎప్ నూతన కమిటీ



**సీతారామపురం డిసెంబర్ 9 ప్రభాతవార్త** సీతారామపురం మండల యుటిఎప్ నూతన కమిటి ఎంపిక బుధవారం సీతారామపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎప్ మండల శాఖ అధ్యక్షులు బోగ్యం శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగింది.యుటిఎప్ ఎన్నిక అధికారిగా యుటిఎప్ జిల్లా కార్యదర్శి ఎడమ తిరపతయ్య, వ్యవహారించారు.ముఖ్య అతిధులుగా ఎంఇఒ2 ప్రవీణ,గౌరవాధ్యక్షులు షేక్ గాజుల రంతుజానీ హాజరైయ్యారు.నూతన మండల కమిటి అధ్యక్షులుగా ఎం.మహేష్,ప్రధాన కార్యదర్శి గొర్ల వీటి వెంకటేశ్వర్లు,సహాయ అధ్యక్షులు ఎస్.కె షబ్బీర్ అహ్మద్, డి.శాంతి. కోశాధికారి సురేష్, ఎస్డబ్ల్యు ఎప్ కార్యదర్శిగా నరసింహరాజు,మహిళా కార్యదర్శి పి.ఎపి కుమారి, కార్యాలయ కార్యదర్శి డిసి వెంగయ్య, ఆడిటర్ ఎం శంకర్రెడ్డి,జిల్లా కౌన్సిలర్గా పేరాల శ్రీనివాసులు, డి.వెంకటేశ్వర్లు,ఎ ప్రసాద్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అనంతరం పలు డిమాండ్లతో కూడిన ప్రతిపాదనలను నూతన మండల శాఖ ఆమోదిచింది. ఆమోదించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి డిమాండ్లు అమలు అయ్యేలా చర్యలు చేపడతామని నూతన కమీటి తెలిపింది.

## సుగమ్య భారత్ అభియాన్లో సాంకేతిక పరిజ్ఞానానికి ఎంత ఖర్చు చేశారు ?



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** గత ఐదు సంవత్సరాలలో సుగమ్య భారత్ అభియాన్ కింద ఆంధ్రప్రదేశ్లో, ముఖ్యంగా నెల్లూరు జిల్లాల్లో ఎంత మంది లబ్దిదారులు ఉన్నారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి వివరాలు కోరారు. రాష్ట్రం, జిల్లా వారీగా ముఖ్యంగా నెల్లూరు జిల్లాల్లో మౌలిక సదుపాయాల ఆధునీకరణకు, సేవల మెరుగుదలకు చేసిన ఖర్చు ఎంతని ఆరా తీశారు. ఈ పథకం కింద లబ్దిదారులకు మద్దతు ఇవ్వడానికి డిజిటల్ యాక్సెసిబిలిటీ టూల్స్, సహాయక పరికరాలు, టెక్నాలజీ- ఎనేబుల్డ్ అసెస్మెంట్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఎంత వరకు అభివృద్ధి చేశారో తెలియజేయాలని కోరారు. ఈ పథకంపై దివ్యాంగులు, అమలు సంస్థలు, సాధారణ ప్రజలలో అవగాహన పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలపై వివరాలు ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి ప్రశ్నలకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ సమాధానం ఇచ్చారు. యాక్సెసిబుల్ ఇండియా ప్రచారం.. సుగమ్య భారత్ అభియాన్ అనే కార్యక్రమాన్ని డిసెంబర్ 3, 2015 న ప్రారంభించినట్లు చెప్పారు. అనుకూల వాతావరణం సృష్టించడం, రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) వ్యవస్థను తయారు చేయడం వంటివి దీని ముఖ్య ఉద్దేశాలన్నారు. ఇది ప్రభుత్వ భవనాలు, ప్రజా రవాణా, వెబ్సైట్లను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి కేంద్రీకరించామన్నారు. రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతిపాదనల మేరకు గ్రాంట్లు ఇవ్వబడతాయని పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్లో రెండు రాష్ట్ర ప్రభుత్వ భవనాల రెట్రోఫిట్టింగ్ కోసం క్రియేషన్ ఆఫ్ బారియర్ ఫ్రీ ఎన్విరాన్మెంట్ పథకం కింద మొదటి విడతగా రూ.31.00 లక్షలు విడుదల అయ్యాయన్నారు. కాన్పూర్లోని ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎల్ఐఎంసీవో), దివ్యాంగుల సహాయం కోసం వివిధ పరికరాలు అందించే ప్రాథమిక సంస్థ అని, త్రీ డీ ముద్రిత ప్రొస్థెటిక్ సాకెట్ల తయారీ కోసం డిజిటల్ స్కానింగ్, కళ్లజోడు పరికరం, అభివృద్ధి, లిథియం- అయాన్ బ్యాటరీతో పని చేసే మోటరైజ్డ్ ట్రైసైకిల్, ప్రముఖ సంస్థల సహకారంతో అభివృద్ధి చేయబడిన కడం మోకాలి కీలు వంటి అనేక అధునాతన పరికరాలను అందిస్తోందన్నారు. ఈ రంగంలో ఇంజనీరింగ్ సంస్థలు, ఉత్పత్తిదారులు నిరంతరం డిజైన్లను మెరుగుపరుస్తుంటాయన్నారు. అదనంగా, ఒట్టోబాక్తో జరిగిన టెక్నాలజీ బదిలీ ఒప్పందం దిగువ అవయవ దివ్యాంగుల కోసం అంతర్జాతీయ ప్రామాణిక సాస్థెటిక్ పరికరాన్ని ఉత్పత్తి చేయడానికి వీలు కల్పించిందని పేర్కొన్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ మే 4, 2023 న ఆరోగ్య సంరక్షణ కోసం యాక్సెసిబిలిటీ ప్రమాణాలను జారీ చేసిందని, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలన్నింటికి యాక్సెసిబిలిటి చర్యలను తప్పనిసరి చేసిందన్నారు. డిపార్ట్మెంట్ ద్వారా ఎవరేర్నెస్ జనరేషన్ అండ్ పబ్లిసిటీ పథకం కింద, దివ్యాంగుల సంక్షేమం కోసం శాఖ యొక్క పథకాలు, వాటి కార్యక్రమాల గురించి సాధారణ ప్రజలకు, సంస్థలకు, వాటి యజమానులకు అవగాహన కల్పించడానికి వివిధ అంశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. దివ్యాంగుల శ్రేయస్సు, సాధికారితను ప్రోత్సహించడానికి జాతీయ సంస్థలు(ఎన్ఐలు), కాంపోజిట్ రీజనల్ సెంటర్లు, శాఖ పరిధిలోని ప్రాంతీయ కేంద్రాలు(ఆర్సీలు), ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు, నమోదిత ఎన్జీవోలు/ సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

## స్వయం సహాయక సంఘాల ఆరోగ్య భద్రతకు బిగ్ బూస్ట్

**- పడారుపల్లిలో సఖి సురక్ష మెగా హెల్త్ క్యాంపు నిర్వహణ**



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 23వ డివిజన్ పడారుపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్లో మెప్మా ఆధ్వర్యంలో సఖీ సురక్ష మెగా మెడికల్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్రెడ్డి హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాల ఆరోగ్య రక్షణకు మెప్మా చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమం ఎంతో ఉపయుక్తమైందని ఆయన అభిప్రాయపడ్డారు. స్వయం సహాయక సంఘాల 30 ఏళ్లు పైబడిన సభ్యులకు 16 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం , వైద్యుల సూచనలు అందించడం , అలాగే ఆయూష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు ఇచ్చే కార్యక్రమం ఎంతో ప్రశంసనీయమన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ సఖి సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోటంరెడ్డి గిరిధర్రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, 22వ డివిజన్ కార్పొరేటర్ మూలే విజయ భాస్కర్రెడ్డి, 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆరవ శ్రీను, టీడీపీ నాయకులు మేకల మధు, చాన్ భాష, పుల్లారెడ్డి, పాముూరు సుధాకర్రెడ్డి, సుబ్బన్న, సికారి భాస్కర్, బాపూజీ, చిన్న మల్లిఖార్జున, శివయ్య, నరసింహారెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన



**సైదాపురం, డిసెంబర్9, ప్రభాతవార్త** మండల పరిధిలోని ఊటుకూరు, తురిమెర్ల గ్రామ రైతు సేవ కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అగ్రికల్చర్ ఏడీఏ బి.శ్రీదేవి మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు నాటిన వరి పంటలను వారు పరిశీలించారు. అనంతరం ఏడీఏ శ్రీదేవి వరిలో సస్యరక్షణ చర్యలు వాటి విధివిధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎరువులు మోతాదుకు మించి వాడకూడదని, ఎక్కువ వాడటం వలన భూసారం దెబ్బతిని నేల సహజ తత్వాన్ని కోల్పోతుందని ఆమె తెలిపారు. రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి జీవన ఎరువులు పెంపొందించుకోవాలని ఆమె అన్నారు. వరి నాట్లు వేసే సమయంలో రైతులు కొసలు తుంచి వరి నాట్లు వేయాలని ఆమె రైతులకు సూచించారు. వ్యవసాయశాఖకు సంబంధించిన పలు సూచనలు, సలహాలను అందించారు. నాయకులు, రైతులు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## సాలిపేట ఆర్ అండ్ బి రోడ్డుపై ప్రమాదాలు



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త** మండలంలోని సాలిపేట సెంటర్ వద్ద ప్రధాన రహదారిలు, కాలవతూ ములు పూర్తిగా శిధిల స్థితికి చేరుకుంది. రోడ్డు పొడవునా తూ ములు, గుంతలు పెచ్చరిల్లి ఉండటంతో ప్రతి రోజూ ప్రమా దాలు జరగని రోజు లేదు. కానీ ఈ పరిస్థితిని ఆర్అండ్బి అధికారులు చూసి చూడకుండా చేతులు దులుపుకోవడం. స్థాని కుల్లో తీవ్ర ఆగ్రహం రేపుతోంది. మూడు సంవత్సరాలుగా రోడ్డు దెబ్బతిన్నా, అధికారుల వైఖరి మాత్రం నిమ్మకు నీ రెక్కినట్లుగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు. స్కూల్ బస్సులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, చిన్నపిల్లలు - ఎవరు వెళ్లాలన్నా ప్రమాదమే అన్న స్థితి నెలకొంది. రోడ్డు దుస్థితి కారణంగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోననే భయంతో ప్రజలు ప్రయాణం చేస్తున్నారు. స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇకనైనా అధికారులు మేలుకొని రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## పెంచలయ్య కుటుంబానికి తక్షణ సాయమందిస్తున్న 'గడ్డం'



**ఆత్మకూరు, డిసెంబరు 9 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని నువ్వురుపాడు పంచాయతీ అశ్వనీపురం ఎస్టీకాలనీకి చెందిన ఐదా పెంచలయ్య కొన్ని నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంగళ వారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈసందర్భంగా పాతజంగాలపలి గ్రామస్తుడు స్వర్గీయ గడ్డం విజయభాస్కర్రెడ్డి గత మూడేళ్ళుగా నువ్వురుపాడు పంచాయతీలో మృతిచెందిన వారి అంత్యక్రియలకు తమవంతుగా 5వేల రూపాయలు ఆర్థికసహాయాన్ని ఆనవాయితీగా అందజేసేవారు . విజయభాస్కర్రెడ్డి అనారోగ్యంతో ఇటీవల అకాల మృతిచెందడంతో ఆయన జ్ఞాపకార్థంగా వారి సోదరుడు గడ్డం శ్రీనివాసులురెడ్డి ఈకార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఐతా పెంచలయ్య కుటుంబ సభ్యులకు 5వేల రూపాయలు తక్షణ సహాయాన్ని అందించేశారు. ఈకార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జ్ కొండ్రెడ్డి రమణారెడ్డి, బూత్ కన్వీనర్ రియాజ్, కవలకుంట సుబ్బారెడ్డి, టిడిపి కార్యకర్తలు చెంచుమని , వెంకటరమణ, దేవరపాటి మాల్యాద్రి, షబ్బీర్, ఖాదర్బాషా, చంద్ర, శ్రీరాములు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి ఎద్దు మృతి

**వింజమూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త** వింజమూరు మండలం గుండె మడకల పంచాయతీ పరిధిలోని చౌటపల్లి గ్రామంలో దేవల్ల వెంకటేశ్వర్లు అనే రైతుకు సంబంధించిన ఎద్దు మృత్యువాదపడింది. రైతు తెలిపిన వివరాల మేరకు మంగళవారం మధ్యాహ్న సమయంలో తన ఇంటి సమీపంలోని విద్యుత్ వైర్లు తెగిపోవడంతో ప్రమాదవశాత్తు ఎద్దు అటుగా వెళ్లి మృత్యువాత పడిందన్నారు. సుమారు 8వేల రూపాయలు విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీరవుతున్నాడు.

## కోడూరు పంచాయతీలో పొలం పిలుస్తోంది



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త** మండలంలోని కోడూరు పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి శిరీష రాణి, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త వినీత, జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు దేవసేనమ్మ, వ్యవసాయ అధికారిణి గీతా కుమారి దిత్వా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. నాట్లు వేసిన పొలాలలో జింక్ లోపం, ఆకుముడుత పురుగు కనిపించినట్లు నిపుణులు గుర్తించారు. పరిశీలన అనంతరం శాస్త్రవేత్త వినీత రైతులకు జింక్ లోప సవరణ విధానాలను వివరించారు. ఆకుముడుత పురుగు నియంత్రణకు క్లోర్పిరిఫాస్ 2 మిల్లీలీటర్లు ప్రతి లీటర్ నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. కలుపు నియంత్రణ కోసం రైతులు కౌన్సిల్ యాక్టివ్, నామిని గోల్డ్ కలుపుమందులను వాడుకోవచ్చని అవగాహన కల్పించారు. నాట్లు వేసిన వరి పొలాలలో నీరు వదిలిన వెంటనే ఎకరాకు 20 కేజీల యూరియా, 10 కేజీల చల్లి వేసుకోవాలని సూచించారు. అలాగే తెగుళ్ల నివారణ కోసం బావిస్టిన్ ఒక్క గ్రాము ప్రతి లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ సహాయకులు పద్మజ పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం విజయవంతంగా ముగింపు

**- సేవా కార్యక్రమాలతో విద్యార్థుల సందడి**



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త:** మండలంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏడవ రోజుతో విజయవంతంగా ముగిసింది. తోటపల్లి గూడూరు ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరం చివరి రోజున పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ శిబిరంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం, మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం వంటి సేవా కార్యక్రమాలతో విద్యార్థులు పాల్గొని శ్రమదానం చేశారు. అంతేకాకుండా, ఆటల పోటీలను కూడా నిర్వహించి, విద్యార్థుల ప్రతిభను వెలికి తెచ్చారు. శిబిరంలో అద్భుతంగా పాల్గొన్న విద్యార్థినీ - విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ప్రముఖ అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ప్రిన్సిపల్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారం కూడా శిబిర విజయానికి కారణమైందని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ యం విజయమ్మ, ఉపాధ్యాయులు బాపనయ్య, శ్రీనివాసులు కోటేశ్వరరావు, గోపి, శ్రీధర్ నిరంజన్ రావు, బాలాజీ వెంకటేశ్వరరావు, గ్రామస్తులు, పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరం ద్వారా విద్యార్థులు సేవా విలువలను ఆచరణలో నిలబెట్టిన విధానం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది.

## కాకుటూరు వద్ద రోడ్డు ప్రమాదం



**వలేటివారిపాలెం డిసెంబరు 9,ప్రభాతవార్త** మండలంలోని కాకుటూరు హెరిటేజ్ సమీపాన నేషనల్ హైవే 167బి వద్ద మంగళవారం రెండు కార్లు ఢీకొన్నాయి.తీవ్ర ప్రమాదం తృటిలో తప్పిపోయింది. రెండు కార్లు తిరగబడ్డాయి.అయినా కారులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బ్రతికి బయటపడ్డారు.క్షతగాత్రులు కందుకూరు,ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే..కందుకూరు నుంచి వలేటివారిపాలెం హైస్కూలు హెచ్ఎం కమలకుమార్, ఉపాధ్యాయులు ఐజాక్, బ్రహ్మయ్య,కుమార్, రామారావులు కారులో వలేటివారిపాలెం వైపు వెళ్తున్నారు. అదే సమయాన నూకవరం నుంచి కందుకూ రువైపుకు వెళ్తున్న మరో కారుతో ప్రమాదం జరిగింది. దీంతో రెండు కార్లు తలకిందులయ్యాయి.ఈ ప్రమా దంలో ఉపాధ్యాయులందరకి స్వల్పగాయాలైనాయి. క్షతగాత్రులను కందుకూరు ఏరియా వైద్యశాలలో చేర్పించారు. డాక్టర్ కళ్యాణ్ వైద్యసేవలు అందించారు. అయినా మెరుగైన వైద్యం కావాలని క్షతగాత్రులను పలువురు ప్రైవేటు వైద్యశాలలకి తరలించారు. ఈ సందర్భంగా బాదితుడు హెడ్మాష్టర్ కమలకుమార్తోపాటు పలువురు మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన కారు డ్రైవరు నిర్లక్ష్యం వలనే ఈ ప్రమాదం నెలకొంద న్నారు.ఆయన నిబంధనలకు విరుద్దంగా వ్యవహరించడంతో ప్రమాదం జరిగిందన్నారు. కారులో ఇరుక్కు పోయిన తమను ఆ సమయంలో అక్కడున్న జనం బయటకి తీశారని తెలిపారు.దేవుని దయవలన అందరం ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నట్లు తెలిపారు.ఈ విషయమై గుడ్లూరు సీఐ మంగారావు మాట్లాడుతూ కేసు నమోదు చేశామన్నారు.దర్యాప్తును వేగవంతం చేయనున్నట్లు ఆయన వివరించారు.

## గిరిజనులకు నిత్యవసర సరుకులు పంపిణీ



**ఇందుకూరుపేట, డిసెంబర్ 9, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం కుడితిపాలెంలో కాకర్లదిబ్బ గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ఏఆర్డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొంథా తుఫాన్ బాధితులకు వంట సరుకులు పంపిణీ కార్యక్రమం ముఖ్య అతిధులుగా మేత్రేక్ బషీర్ సహకారంతో అమ్మ చారిటబుల్ ట్రస్టు అధినేత, కోవూరుతెలుగు యువత ఉపాధ్యక్షులు దొడ్ల మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో 200 గిరిజన కుటుంబాలకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొడ్ల మల్లిఖార్జున మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పొదుపు రుణాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు.ఆధార్కార్డు, బ్యాంకు అకౌంట్లు లేని వారు వెంటనే చేయించుకోవాలని సూచించారు. టీడీపీ గ్రామ అధ్యక్షులు అప్పాని శ్రీనివాసులు, నీటి సంఘం డైరక్టర్ మెట్ట శ్రీనివాసులురెడ్డి, టీడీపీ గ్రామ కార్యదర్శి చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఏపీఎం షరితారెడ్డి, వీఆర్వో హరి పాల్గొన్నారు.

## దిత్వా తుఫాన్ బాధిత రైతులను ఆదుకుంటాం



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** ద్విత్వా తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతుల కోసం నష్ట నివారణ చర్యలను చేపట్టామని జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి పి.సత్యవాణి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర అగ్రికల్చర్ కమీషనర్కు దెబ్బతిన్న పంటల వివరాల నివేదికను అంద జేయడం జరిగిందని తెలిపారు. కమీషనర్ ఆదేశాలతో వరి ధాన్యం విత్తనాలు, వేరుశనగ విత్తనాలు 80 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందని వివరించారు. ధాన్యం ఆర్ఎన్ఆర్- 15048, కేఎన్ ఎం-1638 రకాలు మొత్తం 14,940.5 క్వింటాళ్లు, వేరుశనగ టీసీజీఎస్ - 1694 రకం 150 క్వింటాళ్ల విత్తనాలను తుఫాన్ ప్రభావిత గ్రామాల రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని తెలిపారు. పంటలను నష్టపోయిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## స్క్రబ్టైపస్ సోకకుండా తగు జాగ్రత్త వహించండి డాక్టర్ ఎస్ భాస్కర్





**నెల్లూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త** -వైద్యం స్క్రబ్ టైపస్ వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసం లేదని, నల్లిలా, పేను మాదిరి ఉండే ఈ పురుగు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సర్వలైన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.భాస్కర్ సూచించారు. మంగళవారం ఆయన ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడారు. గతంలోనూ ఈ కేసులు వచ్చేవని, కొత్తగా ఇప్పుడు ప్రత్యేకమేమి కాదన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 1520 కేసులు నమోదు కాగా, నెల్లూరు జిల్లాలో జనవరి నుండి ఇప్పటి వరకు 60 కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా తగు జాగ్రత్తలతో ఈ వ్యాధిని నయం చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం నెల్లూరు నగరంలో 6 యాక్టివ్ కేసులు ఉన్నాయని, అవి కిమ్స్ వైద్యశాలలో 2, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలలో 2, జీజీహెచ్లో 2 ఉన్నాయని తెలిపారు. దీనిని స్క్రబ్ టైపస్ అనే పేరుతో పాటు బుష్ టైపస్ వ్యాధి అని కూడా పిలవడం జరుగుతుందన్నారు. ఈ పురుగులు వర్షాకాలం సీజన్లో పొలాల్లో, గుబురు చెట్ల పైన ఉంటాయని వివరించారు. గత ఏడాది డిసెంబర్ నాటికి 1600 కేసులు నమోదయ్యాయని దాంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఈ వ్యాధి భారిన పడ్డవారి సంఖ్య తగ్గిందని తెలిపారు. అక్టోబర్ నెలలో 13 కేసులు నమోదవగా నవంబర్ నెలలో అత్యధికంగా 26 కేసులు నమోదైనట్లు తెలిపారు. నెల్లూరు నగరంలో 6, నెల్లూరు రూరల్ 7, దగదర్తిలో 6, విడవలూరులో 5, అనంతసాగరంలో 4, బుచ్చిరెడ్డిపాలెంలో 4, వెంకటాచలం మండలాల్లో 3 కేసులు నమోదయ్యాయి. తోటపల్లిగూడూరు, సంగం, కోవూరు రెండేసి కేసులు, ఎస్పేట బోగోలు చేజర్ల కొండాపురం ముత్తుకూరు, అల్లూరు, పొదలకూరు, రాపూరు, సైదాపురం, వరికుంటపాడు మండలాల్లో ఒక్కో కేసు నమోదు అయింది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈవ్యాధికి గురైన వారి ఇంటి పరిసరాల్లో ఇంకెవరైనా స్క్రబ్ టైపస్ కు గురయ్యారా అన్న విషయాలపై కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించి అజిత్రో మైసిన్ వాడకం ద్వారా ఐదు రోజుల్లో నయమవుతుందని డాక్టర్ భాస్కర్ వెల్లడించారు. వ్యాధి నిర్ధారణ కోసం వీల్ ఫెలిక్స్ పరీక్షలు చేస్తున్నారు.

**తగు జాగ్రత్తలు తప్పనిసరిః** ప్రజలు నివసిస్తున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాత దిండ్లు పరుపులు మంచాలు లాంటివి తీసివేయాలి. పిల్లలకు కాళ్లు చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయడం వల్ల కీటకాలకు దూరంగా ఉండవచ్చు. ఊపిరితిత్తుల్లో వాపు రావడం ద్వారా ఊపిరి పీల్చుకోవడం కష్టతరంగా మారిన నేపధ్యంలో స్క్రబ్ టైపస్ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే మెదడులోని రక్షిత పొరల్లో వాపు రావడం వల్ల నరాల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. మూత్రపిండాల వ్యాధులు గుండె, కండరాల వాపు వచ్చే అవకాశం ఉంటుందని ఆయా లక్షణాలు ఉంటే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలని తెలియజేస్తున్నారు.

## పురపాలక సంఘంనందు ఘన వ్యర్థాల నిర్వహణ ఎంతో కీలకం



కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త :కావలి పురపాలక సంఘంనందు ఘన వ్యర్థాల నిర్వహణ ఎంత కీలకమైందని మున్సిపల్ కమీషనర్ శ్రావణ్కుఆర్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక పురపాలకసంఘం సమావేశ మందిరంలో మున్సిపాలిటీలోని శానిటరీ, అమినిటి, వేల్ఫేర్ సెక్రటరీలకు సామర్థ్యాల పెంపుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ నియమించిన నాలెడ్జ్ ఫార్ట్నర్స్ ఆల్ ఇండియా ఇన్స్టూటుట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంటు వారిచే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్సిపల్ కమీషనర్ పాల్గొని మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహన ఎంతో కీలకమైనందని వీటిపై తెలుసుకొని అచరిస్తే చెత్తనుంచి సంపద పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తగి పొడి హానికర ప్లాస్టిక్ వేస్ట్, నిర్వహణ గురించి విరివిగా ఆవగాహన కల్పించి వార్డులో ఎలా ఉపయోగించాలో అనే అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్ఇండియా ఇన్స్టూట్ఆఫ్ లోకల్ రిసోర్స్ పర్సన్ రమాదేవి, వై.జయమదురిమ, తిరుపతిరావు, మున్సిపల్సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకోదండరామస్వామి భూములు పరిశీలించిన జిల్లా దేవాదాయశాఖ అధికారి జనార్దన్రెడ్డి



బుచ్చి డిసెంబర్ 9 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానానికి సంబందించిన భూములను జిల్లా దేవాదాయశాఖ అధికారి జనార్దన్రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా దేవస్థానానికి సంబందించిన భూముల సర్వే జరుగుతుందని తెలిపారు. సర్వే అనంతరం పూర్తిస్థాయిలో వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. ఈనేపద్యంలో కొంతమంది రైతులు తమ భూములను 22 ఏలో నుండి తొలగించి తమకు భూములు రిజిస్టేన్ చేయాలని అధికారులను కోరారు. 2007లో రాష్ట్ర హైకోర్టు రైతులకు చెందాలని తీర్పు ఇచ్చిందని వారు తెలియజేశారు. అధికారులు వివరాలన్ని సేకరించి నివేదికను ప్రభుత్వానికి తెలియజేస్తామని అన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి



**కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త** : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆహ్లాదాన్ని ఆరోగ్యాన్ని కలిగిస్తాయని విశ్రాంత డైట్ అధ్యాపకులు తూపిలి సుందర్ రామిరెడ్డి తెలిపారు. పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయగిరి రోడ్డు మినీ స్టేడియం వద్ద క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి క్రీడాపోటీలను ప్రారంభించారు. అనంతరం ఆకుల రమణయ్య మాట్లాడుతూ క్రీడాపోటీలు ప్రతి ఏడాది ఈనెలలో జరుగుతాయని తెలిపారు. ఈ క్రీడల్లో వృద్యాప్యాన్ని మరిచి ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొన్నారు. క్రీడావిజేతలకు 17న నిర్వహించిప ఆలిండియా పెన్షనర్ల దినోత్సవం రోజు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రీడల్లో 79మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

## ఇమ్రాన్ పార్థీవ దేహానికి ఎమ్మెల్యే నివాళులు



**కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త** : కావలి మునుమూరు 15వ వార్డుకు చెందిన టిడిపి కార్యకర్తల ఎస్.ఇమ్రాన్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇమ్రాన్ మృతిపై కుటుంబసభ్యులను అడిగి తెలుసుకొని సానుభూతిని తెలిపారు. అన్ని విధాల ఇమ్రా న్కుటుంబానికి అండగా ఉంటాననితెలిపారు. ఇమ్రాన్ మృతిపట్ల పార్టీకి తీరని లోటుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ రవికుమార్, విజయ దంపతులను సిబ్బంది ఘన సత్కారం



కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త : కావలి పట్టణంలోని ప్రముఖ డాక్టర్లు బెజవాడ రవికుమార, విజయలు ఆదర్శ దంపతులని రెడ్క్రాస్ ఛైర్మెన్ డి.రవిప్రకాస్ పేర్కొన్నారు. డాక్టర్ రవి, డాక్టర్ విజయ దంపతుల 43వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా రెడ్క్రాస్ సభ్యులు, సిబ్బంది ఘనంగా మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా రవిప్రకాస్ మాట్లాడుతూ ఈ దంపతులు అభ్యుదయ బావాలతో వృత్తిని కొనసాగిస్తున్నారని తెలిపారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ కావలి రెడ్క్రాస్లో క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ నివారణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్క్రాస్ పాలకమండలి సభ్యులు మద్దుల నరసింహరావు, డాక్టర్ పాముూరు శ్రీధర్, డాక్టర్ రమ్య, బెజవాడ ప్రసన్నకుమార్, జిల్లా పాలకమండలి రెడ్క్రాస్సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, గాదిరెడ్డి, హరనాథ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసేమియా కేంద్రంలో రక్తమార్పిడి చేయించుకొంటున్న చిన్నారులకు నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ వసీం, నియోజకవర్గ పి4 పథకం ఇన్చార్జ్ సదానందం, విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి మందులు, పౌష్టికాహారం అందజేశారు.

## కోటూరుపాడు గ్రామ రోడ్డు నిర్మాణానికి నిధులు రూ.కోటి మంజూరు



**రాపూరు,డిసెంబరు 9ప్రభాతవార్త** రాపూరు మండలంలోని సిద్దవరం గ్రామ పంచాయితీ పరిధిలోని కోటూరుపాడు గ్రామానికి రాపూరు ప్రధాన రహదారి నుండి గ్రామంలోకి వెళ్లేందుకు తారు రోడ్డు నిర్మాణానికి రూ. 1 కోటి 6 లక్షల నిధులు మంజూరు అయినాయి. ఈ సందర్భంగా రాపూరు మండల ప్రధాన కార్యదర్శి మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ తమ సొంత పంచాయితీ పరిధిలోని కోటూరుపాడు గ్రామానికి రోడ్డు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతు వున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాక ప్రజల బాధలు వర్ణణాతీతంగా వున్నాయన్నారు. గత ఎన్నికల సమయంలో ఈ గ్రామంలో పర్యటించిన చెన్ను సోదరులైన పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డిల దృష్టికి ఈ రోడ్డు దుస్థితిని తీసుకోని వెల్లడం జరిగిందన్నారు. వారు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ దృష్టికి ఈ సమస్యను తీసుకోని వెళ్లి తప్పని సరిగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయనను కోరడం జరిగిందన్నారు. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ సాస్కి పథకం కింద ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 1 కోటి 6 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. తమ పంచాయితీ పరిధిలోని కోటూరుపాడు గ్రామ చిరకాల సమస్యను తీర్చుతున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణకు, సమస్య పరిష్కారానికి చోరవ చూపిన చెన్ను సోదరులు మాజీ పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డికి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డికి ఆయన ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరుపున, వ్యక్తిగతంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నృసింహుని సన్నిధిలో గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్టి త్రిపాఠి



**పెంచలకోన(రామూరు),డిసెంబరు 9ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారిని మంగళవారం గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్టి త్రిపాఠి, నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వెజండ్లతో కలసి దర్శించుకున్నా రు. కోనకు వచ్చిన ఐజి, ఎస్పీలకు ఆలయ అధికా రులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ పెను శిల లక్ష్మీనృసింహ స్వామి, శ్రీ ఆధిలక్ష్మీ అమ్మవారు, శ్రీ అంజనేయ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో వారికి ఆశీర్వచణాలు అందజేశారు. ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి వారికి స్వామి వారి తీర్థప్రసాదాలను, చిత్రపఠాన్ని స్వామి వారి శేషవస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్, రాపూరు సిఐ సత్య నారాయణ, ఎస్ఐ వెంకట రాజేష్, ఎఎస్ఐ వెంకటేశ్వర రావు తదితరులున్నారు.

## పంచాయతీల్లో శానిటేషన్ చేపట్టాలి



**దగదర్తి, డిసెంబర్ 9, ప్రభాతవార్త** దగదర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దగదర్తి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. పంచాయతీలు.. అలాగే జీఎస్డబ్ల్యూ, డిప్యూటీ ఎంపీవో జాలయ్య సంక్షేమ కార్యక్రమాల మీద రివ్యూ చేయడం జరిగింది. ఎంపీడీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంచాయతీల్లో శానిటేషన్ చేపట్టాలన్నారు. పంచాయతీ శానిటేషన్ గ్రామాల్లోని పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఈ మధ్య కురిసిన వర్షాలకు గృహాలలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే దాని వల్ల దోమలు తయారవుతాయని మురికి నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకునేలా గ్రామ ప్రజలకు చెప్పాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మా స్థలంలో బిఎస్ఎన్ఎల్ భవనాన్ని తొలగించాలి

**కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త :** కావలి నేషనల్ హైవేరోడ్డు పక్కన ఉన్న మాస్థలంలో బిఎస్ఎ న్ఎల్ భవనాన్ని తొలగించి మాకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన శోభనాల సాయి సుస్మిత కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కావలి నేషనల్ హైవే రోడ్డుపక్కన ఉన్న మా స్థలం రిజిష్టర్ కార్యాలయంలో 1వ పుస్తకం, దస్తావేజు నెంబర్ 344/2401గా కాబడిన 66 అంకణాల్లో బిట్-1 సర్వేనెంబర్ 651/3ఎ240 చదరపు గజాలు విస్తీర్ణం గల ఖాళీస్థలం సర్వేనెంబర్ 30 అంకణాలు పట్టా భూమి సాయి సుస్మిత అనే నాపేరుతో తరువాత నా భర్త లీలావెంకట శ్రీహర్ష పేరుతో 36 అంకణాలు పట్టా భూమి కొనుగోలు చేశాము. అయితే ఈ మొత్తం స్థలం పాత యజమాని బిఎస్ఎన్ఎల్ వారి కోరికపై 3బిలో భవనం కట్టుకోమని అనుమతి ఇచ్చారు. కానీ 1973లో అదంతా ఖాళీస్థలం అవడంతో 3బిలో కట్టాల్సిన బిఎస్ఎన్ఎల్ భవనంను బిఎస్ఎన్ఎల్ వారు పొరపాటున 3ఎ అయిన మాస్థలంలో కట్టడం జరిగిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో మీ భూమిలో 3బి అడంగల్ ప్రింట్‌తీశాము,ఆఅడంగల్ ప్రకారం అసలు బిఎస్ఎన్ఎల్ భవనంకట్టాల్సింది 3బిలో కావున మా స్థలంలో దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న బిఎస్ఎన్ఎల్ భవనం తొలగించమని కోరడం జరిగిందని తెలిపారు.



## నష్టపోయిన రైతులకు సబ్సిడీ విత్తనాలు

**విడవలూరు, డిసెంబర్9 ప్రభాతవార్త :** మండలంలోని ముదివర్తి, అన్నారెడ్డిపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంఈఓ సిహెచ్ఎస్ లక్ష్మి నిర్వహించారు. రైతులకు ఇటీవల సైక్లోన్ వల్ల దెబ్బతిన్న వరినారు మడులను, వరిపొలాలను పరిశీలించి పై అధికారులు సూచనల మేరకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు నారుమడి నుంచి ప్రధాన పొలంలో నారు నాటుకునేటప్పుడు ఖచ్చితంగా ఆకు కొనలు తుంచుకొని నాటుకోవడం వల్ల తొలిదశలో కాండంతొలుచు పురుగు గుడ్లను నివారించుకోవచ్చని సూచించారు. విఏఏ వెన్నల, సాయిలక్ష్మి, కవిత, శ్రావ్య, రైతులు పాల్గొన్నారు.



## అగ్రిమెంటు ద్వారా కొనుగోలు భూములను ధరఖాస్తు

**కొడవలూరు, డిసెంబర్9 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సాదా బైనమా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తహశీల్దార్ చంద్రశేఖర్ నేదొక ప్రకటనలో తెలిపారు. 2024జూన్ నెలలో అగ్రిమెంటు ద్వారా కొనుగలు చేసిన పట్టా భూములను క్రమబద్ధీకరించుటకు ఫారం10 నమూనాలో సచివాలయం, మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలనితెలిపారు. దరఖాస్తు నమూనా చేసిన 90రోజుల్లో పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. 2027 ఏడాదికి దరఖాస్తు చేసుకునేఅవకాశం ఉందన్నారు. చిన్న సన్న రైతులకు రిజిస్ట్రేషన్ ఫీజులు వినహాయించడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని కోరారు.



## రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారుపతకం సాదించిన శ్రీచైతన్య విద్యార్థిని

**కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త :** గతనెల 25న పల్నాడుజిల్లా వినుకొండలో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలానికి చెందిన పాత ఊరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో టి.అశ్విని బంగారుపతకాన్ని సాధించి లక్నోలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. బాలుర విభాగంలో లోకేష్ తృతీయస్థానం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందనసభలో కళాశాల కరస్పాండెంట్ శ్రీకర్ల వెంకటయ్య, కళాశాల డైరెక్టర్లు పివిఎస్‌ప్రసాద్, ఎం.కొండయ్య, వి.మలికార్జున కన్వీనర్ నందనవనం మదుసూదన్‌రావు, ప్రిన్సిపాల్ టీవీలు కోదర్ కళాశాల ఏఓ స్టాలిన్‌లు పాల్గొని విద్యార్థులను సత్కరించారు. విజయానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ వెంకటేవ్వర్లకు కళాశాల యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## ఐఎంఏ ప్రతినిధులను సత్కరించిన జనవిజ్ఞాన వేధిక





**కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త :** జన విజ్ఞాన వేధిక ఆధ్వర్యంలో అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామస్వామి, కార్యదర్శి ప్రవీణ్ మల్టీస్పెషాలిటి ఆసుపతి అదినేత ప్రవీన్‌కుమార్, కోశాదికారి డాక్టర్ వెంకటేష్, కార్యవర్గసభ్యులు నూతనంగా ఎన్నికైన సందర్భంగా వారిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి శాలువలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోట వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి, హరినాథ్, కోశాదికారి సుబ్బారామశర్మ, జిల్లా ఉపాధ్యక్షులు పాపిశెట్టి జానకిరామ్, పట్టణ ఉపాధ్యక్షులు ఎస్‌కె.ఖాదర్‌బాషా, కల్లయ్య సహాయ కార్యదర్శులు శారద, గుణకల శివయ్య, రాయపాటి దిలీప్‌కుమార్, మురళీక్రిష్ణ మండవ వెంకటక్రిష్ణయ్య, కార్యవర్గ సభ్యులు మొగిలిశెట్టి జమున, ఎస్‌కె.జమీర్, ఎంవిఎల్‌ప్రసాద్‌రావు, ఎం.మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగావకాశాల పండుగ

**- నెల్లూరులో మెగా జాబ్ మేళా - వీఆర్ పీజీ కళాశాలలో భారీ స్పందన**

**- 96 మందికి ఉద్యోగాలు - ఉద్యోగాల కల నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వ అంకితభావం**

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు యువత నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని అభ్యర్థులను ఉత్సాహపరిచారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు సృషించే పనిలో ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందని ఆయన తెలిపారు. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి పరిశ్రమలను స్థాపించేందుకు అనుకూల వాతావరణం కల్పించడం, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ వంటి కార్యక్రమాలు ఇందుకు నిదర్శనమని గిరిధర్‌రెడ్డి గుర్తు చేశారు. జాబ్ మేళాలో పాల్గొన్న యువతీ, యువకులందరికి శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైన 96 మందిని ప్రత్యేకంగా అభినందించారు. యువత భవిష్యత్తు బాగుండాలన్న ఆకాంక్షతో ప్రభుత్వం తీసుకుంటున్న సంకల్పబద్ధమైన చర్యలు త్వరలో మరిన్ని అవకాశాల రూపంలో కనిపిస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.



## 17వ డివిజన్‌లో ప్రజా సమస్యలపై పర్యటన

### - కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్‌లో శ్రీ సాయి బాలాజీ లేఅవుట్, నిర్మల్ లేఅవుట్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మునిసిపల్, ఎలక్ట్రికల్ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికుల నుంచి అభిప్రాయాలను సేకరించి తక్షణ చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 17వ డివిజన్ అభివృద్ధికి 4 కోట్ల రూపాయలు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేసినట్లు గిరిధర్‌రెడ్డి గుర్తు చేశారు. నెల్లూరు రూరల్‌ను అభివృద్ధి మార్గంలో ముందుకు నడిపిస్తున్న ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి నాయకత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అభిలాషించారు. నెల్లూరు రూరల్ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లకు ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జీజీహెచ్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు, 17వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు ఊటుకూరు దత్తాత్రేయ, 12వ డివిజన్ అధ్యక్షులు ఇంగిలాల అబ్రహం, చింతారెడ్డిపాలెం పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు చింతా ప్రభాకర్‌రెడ్డి, మస్తానయ్య, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కుంచాల విజయ్ భాస్కర్, టీడీపీ నాయకులు పట్రాంగి అజయ్, ఉప్పల వెంకటేశ్వర్లు, ఉయ్యాల రవీంద్ర, మస్తానయ్య, రవి రెడ్డి, గౌస్, తుళ్లూరు మల్లి, సుబ్రహ్మణ్యం, మల్లిపెడ్డి సుధాకర్, మాలకి వాళ్ళం విజయ్, బాబు, చాన్ భాషా, పవన్ కుమార్, రబ్బానీ, రోస్దర్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## ఏపీలో డీప్ సీ ఫిషింగ్ అభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలేంటి

### - లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలు



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** దేశ వ్యాప్తంగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ తీరం వెంబడి డీప్ సీఫిషింగ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏంటని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం లోక్‌సభలో ఈ మేరకు పలు అంశాలను ఆరా తీశారు. డీప్ సీ ఫిషింగ్‌కు ఉపయోగిస్తున్న పడవల సంఖ్య ఎంతని అన్నారు. వీటి సంఖ్యను పెంచడానికి తీసుకుంటున్న చర్యలు, డీప్ సీ ఫిషింగ్ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల వివరాలపై ఆరా తీశారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో పథకాల అమలుకు కేటాయించిన నిధుల వివరాలు, లబ్ధిదారుల సంఖ్య, డీప్ సీ ఫిషింగ్ ఓడల వాడకంపై అవగాహన వంటి అంశాలపై ఆరా తీశారు. దాంతో పాటు ఒడిశాలోని భద్రక్, బాలసోర్ జిల్లాల్లో సహకార నేతృత్వంలో డీప్ సీ ఫిషింగ్, ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్(ఎఫ్‌పీపీఓ) మద్దతు, సముద్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉన్న ప్రతిపాదనలపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ, పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానం ఇచ్చారు. ఇండియన్ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజెడ్)లో మత్స్య వనరుల పొటెన్షియల్ దిగుబడిని ధృవీకరించడానికి ఏర్పాటు చేసిన నిపుణుల కమిటి అంచనా మేరకు.. ఇఇజెడ్ యొక్క పొటెన్షియల్ దిగుబడి 53.1 లక్షల టన్నులు ఉందన్నారు. దీనిలో డీప్ సీ ఫిషింగ్ వనరుల పొటెన్షియల్ దిగుబడి(500 మీటర్ల లోతు జోన్ దాటి) 2.31 లక్షల టన్నులన్నారు. ప్రస్తుతం, భారతదేశం డీప్ సీ ఫిషింగ్ వనరులతో సహా 44.95 లక్షల టన్నుల (2023-24 ) సముద్ర మత్స్య వనరులను ఉపయోగించుకుంటోందని చెప్పారు. ఇది ఇఇజెడ్‌లోని వనరుల పొటెన్షియల్ దిగుబడి కంటే తక్కువగా ఉందన్నారు. జాతీయ సముద్ర మత్స్యకార విధానం, 2017 ఇతర అంశాలతో పాటు, సాంప్రదాయ మత్స్యకారులు లోతైన సముద్ర చేపల వేటను చేపట్టడానికి మత్స్యకారుల సహకార సంఘాలు/ స్వయం సహాయక బృందాల ద్వారా దేశీయ లోతైన సముద్ర చేపల వేట నౌకలను ప్రవేశపెట్టడానికి ఆన్‌బోర్డు శిక్షణ, మార్కెట్లు, ఎగుమతులకు అనుసంధానాలకు కొత్త పథకాలను ప్రవేశపెట్టాలని భావిస్తోందని చెప్పారు. భారత్ ఈఈజెడ్, హై సీస్‌లోని డీపన - సీ ఫిషరీస్ వనరులను ఉపయోగించుకునే అవకాశాన్ని కల్పించేందుకు ఒక ఉప భాగాన్ని ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) కింద జనరల్ కేటగిరికి 40 శాతం సబ్సిడీ, ఎస్సీ ఎస్టీ / మహిళా లబ్దిదారులకు 60 శాతం సబ్సిడీ చొప్పున సాంప్రదాయ మత్స్యకారులకు ఆర్థిక సహాయం కొనసాగించడబడుతుందన్నారు. బ్లూ రివల్యూషన్, పీఎంఎంఎస్‌వై, ఎఫ్‌ఐడీఎఫ్ పథకాల కింద, సాంప్రదాయ మత్స్యకారులు 1243 డీప్ సీ ఫిషరీస్ వెజల్స్(డీఎస్‌ఎఫ్‌వీ) కొనుగోలు చేయడానికి, ఎగుమతి సామర్థ్యం కోసం ఇప్పటికే ఉన్న 1330 ఫిషింగ్ ఓడలను అప్‌గ్రేడ్ చేయడానికి రూ.895.9 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరు చేయబడ్డాయన్నారు.

## విక్రమ సింహపురి యూనివర్సిటీ వంటశాలకు కొత్త వంట పాత్రలు అందజేత



**వెంకటాచలం డిసెంబర్ 9 ప్రభాతవార్త** విద్యార్థులకు మరింత నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యం తో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (VSU) వంటశాలకు కొత్త వంట పాత్రలను ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. విద్యార్థుల ఆహార భద్రత, శుభ్రత, వంటశాల నిర్వహణను మెరుగుపరచడం ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశం. క్యాంపస్లో జరిగిన ఈ కార్యక్రమంలో, వంటశాల అవసరాల మేరకు ప్రత్యే కంగా కొనుగోలు చేసిన స్టెయిన్లెస్ స్టీల్ పెద్ద పాత్రలు, బియ్యం కుక్కర్లు, దాల్చిన పాత్రలు, నిల్వ డబ్బాలు, వడ్డన పాత్రలు, శుభ్రపరిచే పరికరాలు మొదలైన వాటిని ఆయన వంటశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, "విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన భోజనం అందించడం విశ్వవిద్యాలయం యొక్క అత్యంత ప్రాధాన్యత. ఈ కొత్త పాత్రల వల్ల వంట ప్రక్రియ మరింత పరిశుభ్రంగా, సమర్థవంతంగా జరుగుతుందని" పేర్కొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

### - గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి



**పొదలకూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి అన్నారు. పొదలకూరు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా పొదలకూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశామన్నారు. పొదలకూరు పోలీస్ సర్కిల్ లో పొదలకూరు, మనుబోలు పోలీస్ స్టేషన్‌లు వస్తాయన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఊపేక్షించేది లేదన్నారు. జిల్లా ఎస్పీ అజిత వేజేండ్ల, నెల్లూరు రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులురావు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శివరామ కృష్ణారెడ్డి, ఎస్ఐ మహమ్మద్ హనీఫ్ ఆయన వెంట ఉన్నారు.

## పొదలకూరు రోడ్డుకు ఇరువైపులా కంపను తొలగించిన పోలీసులు : సి.ఐ శివరామకృష్ణా రెడ్డి



**పొదలకూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త:** పొదలకూరు - నెల్లూరు రోడ్డు మార్గంలోని మరుపూరు గ్రామం దాటిన తర్వాత వచ్చే బ్రిడ్జ్ అవతల ఇవతల ఉన్న మార్జిన్‌లో ఉన్న కంపను పొదలకూరు పోలీసులు తొలగించారని సిఐ శివరామకృష్ణా రెడ్డి తెలిపారు. అలాగే రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చడం జరిగిందన్నారు. అయితే ద్విచక్ర వాహనాలు నడిపేవారు చాలామందికి ఇక్కడ గోతు లు కారణంగా తరచూ ప్రమాదములు జరిగేవని సిఐ తెలిపారు. అదే విధంగా ఎస్పి అదేశాల మేరకు రోడ్ సేఫ్టీలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే రాత్రి పూట బ్రిడ్జ్ కనపడే విధంగా ఇరువైపులా రేడియం స్టిక్కర్‌లు అంటించారు. పొదలకూరు పోలీసులు పాల్గొన్నారు.

## సర్వేపల్లిలో గుడులు, బడుల ఆస్తులకు భద్రత కరువు : మాజీ మంత్రి కాకాణి



**పొదలకూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త** పొదలకూరు మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన శ్రీ విఘ్నేశ్వర దేవస్థాన స్థలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని స్థానికులు, భక్తులతో కలిసి మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో గుడులు, బడుల ఆస్తులకు భద్రత లేకుండా పోయిందన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్థానికులు ప్రజల అవసరాల దృ ష్ట్యా గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పాత తేదీలతో డాక్యుమెంట్లు తయారు చేసుకొని తెలుగుదేశం నాయకులు గుడి నిర్మాణానికి ఉపయోగించే భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. పొదలకూరు ప్రభుత్వ స్కూల్ స్థలాన్ని ఆక్రమించుకొని, కట్టడాలు చేపట్టినా, చర్యలు శూన్యం. పొదలకూరు ప్రాంతం పై ఏ మాత్రం అవగాహన లేని, సోమిరెడ్డి ఆక్రమణ దారులకు వంతపడుతున్నాడన్నారు. ఆక్రమణదారులు పోలీసులను సైతం లెక్క చేయకుండా, జెసిబిలతో ప్రహరీ గోడను కూల్చి వేయడం దారుణమన్నారు. పోలీసులు మొక్కుబడిగా కేసులు పెట్టి, తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో భక్తులు, స్థానికుల మనోభావాలను గౌరవించకుండా, ఆస్తులకు రక్షణ కరువవ్వడం దౌర్భాగ్యమన్నారు. పోలీసులు ఆక్రమణ దారులపై చర్యలు చేపట్టాలి తప్ప, ప్రశ్నించే వారిపై కేసులు పెడితే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని హెచ్చరిస్తున్నానన్నారు. పోలీసులు స్పందించి, దేవాలయ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోతే, శాంతిభద్రతలకు విఘాతం కలిగితే పోలీసు వారే బాధ్యత వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తమ ప్రాణాలను సైతం అడ్డుపెట్టి, గుడి స్థలాన్ని రక్షించు కుంటామంటున్న స్థానికులు, భక్తుల మనోభావాలను గౌరవించి, గుడి నిర్మాణానికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కుట్రలు, కుతంత్రాలు పన్ని స్థానిక ప్రజల అవసరాలను ఉపయోగించాల్సిన భూమిని దక్కించుకోవాలని ఎవరు చూసినా, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే తిరిగిప్రజల అవస రాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులపై దౌర్జనంగా వ్యవహరించే వారిపై పోలీ సులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భూములు ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా, అన్యాక్రాంతం కాకుండా, ప్రజలే ముందుకు వచ్చి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

## సబ్సిడీతో రైతులకు విత్తనాలు



**కోవూరు, డిసెంబరు9 ప్రభాతవార్త :** కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న నాట్లకు గానూ 80 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని వ్యవసాయ సహాయ సంచాలకులు జి. అనిత అన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ కోవూరు మండలానికి కేఎన్ఎం రకం 95 క్వింటాళ్ళు, బుచ్చి మండలానికి 100 క్వింటాళ్లు మంజూరు అయ్యాయన్నారు. ఇటీవల అకాల వర్షాలకు దెబ్బతిన్న నార్లు వేసి రైతులు వారి వారి పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సబ్సిడీతో ఈ విత్తనాలు పొందాలన్నారు.

## గ్రామ సభ ద్వారా అర్జీలు స్వీకరణ



**కోవూరు, డిసెంబరు9 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా టెక్నికల్ అసిస్టెంట్ సాధిక్ మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ పథకం కింద చేపట్టనున్న పనులకు సంబంధించి ఈ గ్రామ సభ ద్వారా అర్జీలు స్వీకరించే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పడుగుపాడు ఇన్‌చార్జి జెట్టి మదన్‌రెడ్డి మాట్లాడుతూ పడు గుపాడు పంచాయతీ పరిధిలో రానున్న సంవత్సరంలో ఏయే పనులు చేపట్టాలో అనే విషయాలను లిఖిత పూర్వకంగా అర్జీ రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి కార్యదర్శి సలీమ్, టీడీపీ నాయకులు విన్నకోట వాసు, ఆవుల వాసు, రమేష్ యాదవ్, డి. శ్రీనివాసులు నాయుడు, జనసేన కోవూరు ఇన్‌చార్జి చప్పిడ్ శ్రీనివాసులు రెడ్డి, మన్నేపల్లి పవన్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, డిసెంబరు9 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మార్గశిర మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నంద కిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## గ్రామ పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతాం



**కోవూరు, డిసెంబరు9 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తానని వేగూరు గ్రామ సర్పంచ్ అమరావతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వేగూరు గ్రామ పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌ను నియమించి నూతనంగా కొనుగోలు చేసిన ట్రై సైకిళ్లకు సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ చెత్తను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా మీ ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్‌కు తడి చెత్త, పొడి చెత్త రూపంలో వేరువేరుగా అందజేయాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు వేగూరు సుబ్బానాయుడు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి



**కోవూరు, డిసెంబరు9 ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిణి పి.మేరీ కమల అన్నారు. కోవూరు మండలం పాటూరు, కోవూరు, నాల్గవ సచివాలయ ప్రాంతంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నాట్లు దెబ్బతిన్న రైతులు యూరియాను 20 నుంచి 25 కిలోలు, పొటాష్‌ను 10 నుంచి 15 కేజీల వరకు కలిపి చల్లుకోవాలన్నారు. నీటిలో మునిగిన పొలాలకు కార్బండిజం ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవడం వలన తెగులు నివారించవచ్చన్నారు. వరినాట్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో కేఎన్ఎం 1638 రకం వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారిణి షేక్. అసీమా, గ్రామ వ్యవసాయ సహాయకులు కె. ప్రభ, వీఏఏ చందన, రైతులు ఉన్నారు.

## పీజీఆర్ఎస్ పిటీషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు డిసెంబరు9 ప్రభాతవార్త :** ప్రతి సోమవారం ప్రజల నుంచి పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలకు సంబంధించి వాటి పరిష్కారంపై సంబంధిత గ్రామ సచివాలయ ఉద్యోగులు తగు చొరవ తీసుకోవాలని జీఎస్‌డబ్ల్యూ డిప్యూటీ ఎంపీడీవో సురేష్ అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీ లిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగి ప్రభుత్వం నిర్దేశించిన వేళలు తప్పక పాటించాలన్నారు. ఎవరికి కేటాయించిన విధులు, బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి నాయబ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## ఎంపీడీవోచే సచివాలయాల తనికఖీ



**బిట్రగుంట డిసెంబర్ 9 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట గ్రామ సచివాలయం ఒకటి, రెండు లను మంగళవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, వివిధ రికార్డులును ఆయన పరిశీలన చేశారు. విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని, సమయపాలన పాటించాలని ఆదేశించారు.శాఖల వారిగ చేపట్టే సర్వేలను సకాలంలో పూర్తిచేయాలనీ ఆదేశించారు.

## నెల్లూరులో రైల్వే ఆసుపత్రి ఏర్పాటు పై రైల్వే మంత్రి సానుకూల స్పందన



**బిట్రగుంట డిసెంబర్ 9 ప్రభాతవార్త** జిల్లా కేంద్రమైన నెల్లూరు లో ఆధునిక రైల్వే ఆసుపత్రి ఏర్పాటు చేయాలనిరాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని ప్రత్యక్షంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సంద ర్భంగా మంత్రి ప్రతిపాదనను సానుకూలంగా అంగీకరించినట్లు వెల్లడించా రు. నెల్లూరు రైల్వే స్టేషన్ లో రోజుకు 22,000 మందికి పైగా ప్రయాణీకులను, 110 రైళ్లను నిర్వహిస్తున్న, ఇప్పటికే స్టేషన్ అభివృద్ధికి 102 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అయినప్పటికీ, ఇంత పెద్ద జిల్లాకేంద్రంలో ఇప్పటికీ రైల్వే ఆసుపత్రి లేకపోవడం ఉద్యోగులు, పింఛన్దారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడేలా చేస్తోంది.నెల్లూరులో 500 మంది రైల్వే ఉద్యో గులు, 850 మంది పింఛన్దారులు ఉండగా, నెల్లూరులో వెంటనే పూర్తి స్థాయి రైల్వే ఆసుపత్రిని ఏర్పాటు చేయాల్సిన అవసరం అత్యవసరం అని ఇద్దరు ఎంపీలు మంత్రికి వివరించారు. ఈ విజ్ఞప్తిని మంత్రి అశ్విని వైష్ణవ్ ఎంతో సానుకూలంగా తీసుకొని, నెల్లూరులో రైల్వే ఆసుపత్రి ఏర్పాటు ప్రతిపాదనను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బీద మస్తాన్ రావు యాదవ్ మాట్లాడుతూ, రైల్వే ఉద్యోగులు, పింఛన్దారులు తమ జీవిత మంతా రైల్వే సేవకు అంకితం చేశారు. ఇప్పుడు వారికి అవసరమైన సమయంలో సమీపంలోనే వైద్య సదు పాయం అందుబాటులో ఉండాలని కోరారు.. నెల్లూరులో రైల్వే ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్ర మంత్రి అం గీకరించడం హర్షించదగ్గపరిణామం అని పేర్కొన్నారు.

## వెంకన్నపురంలో పొలం పిలుస్తోంది

**కొడవలూరు, డిసెంబర్9 ప్రభాతవార్త :** మండలంలోని వెంకటన్నపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జిల్లా వ్యవసాయఅధికారిణి సత్యవాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న నారు మడి నాటు వేసిన పొలాల్లో తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు అవగాహన కల్పించారు.



కోవూరు వ్యవసాయ సహాయ సంచాలయకులు అనిత మాట్లాడుతూ జీవన ఎరువులు పీఎండిఎస్ సెట్టు వాడి రైతులు సారవంతం చేసుకొని అధిక దిగుబడులు పొందడం జరుగుతుందని తెలిపారు.మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాకర్లను కలిసిన సీతారామపురం నేతలు



**సీతారామపురం డిసెంబర్ 9 ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం సీతారామపురం టిడిపి గ్రామ కమిటి అధ్యక్షులు పిడుగు రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా సీతారామపురం మండలాభివృద్ధిపై చర్చించారు. పలుసమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లారు. సమస్యల పరిష్కా రానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సానుకూలంగా స్పందించారని పిడుగు రమేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో పబ్బులేటి పల్లి మాజీ సర్పంచ్ కుర్రా రమణయ్య, గోనువారిపల్లి, పబ్బులేటిపల్లికి చెందిన టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళాశాల బిసి హాస్టల్ విద్యార్దులకు స్పోకన్ ఇంగ్లీషు క్లాసులు



**బుచ్చి డిసెంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కళాశాల బిసి బాలకలు బాలురకు డిబిసి వెంకటలక్ష్మీ ఆదేశానుసారం ప్రత్యేకంగా కృష్ణ చైతన్య కళాశాలలో స్పోకన్ ఇంగ్లీషు క్లాస్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆత్మకూరు డిబిసి ఐ.కృష్ణయ్య పర్యవేక్షించారు. ఈ సందర్బంగా కృష్ణయ్య మాట్లాడుతు బాలబాలికలు ఇంగ్లీషులో బాగా రాణించాలని, తద్వారా ఉద్యోగాలు సాధించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. డిబిసి ఆదేశాను సారం ప్రతి రోజుప్రత్యేకంగా స్పోకన్ ఇంగ్లీషు మీడియం క్లాస్‌లు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో వార్డున్స్ కె. రమణయ్య, డి. కామేశ్వరమ్మ, ఎవిఎస్ లక్ష్మీ, ఎం .విజయలక్ష్మీ విద్యార్దులు పాల్గొన్నారు.

## 14 నుండి నియోజకవర్గ క్రీడల పోటీలు



**బుచ్చి డిసెంబర్ 9ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం అపస్మా సభ్యులు మను హర్‌రెడ్డి ట్రస్టు ఆద్వర్యంలో నిర్వహించే నియోజకర్గ స్దాయి క్రీడల పోటీలకు అతిగా బుచ్చి మండల విద్యాశాఖ అధికారులు ఎం. దిలీప్‌కుమార్, ఎంఇఓ-2 వెంకటరత్నంని ఆహ్వానించినట్లు అపస్మానాయకులు తెలిపారు. 14 వ తేది ఆదివారం బుచ్చి మండలంలోని సెయింట్ థామస్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా అద్యక్షులు నేలనూతల శ్రీదర్ బుచ్చి ప్రెసిడెంట్ ఆయుబ్‌ఖాన్, నియోజకవర్గ కార్యదర్శి మల్లేశ్వర్‌రెడ్డి, కరస్పాండెంట్స్ ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు తహశీల్దార్ సన్మానం



**కొడవలూరు, డిసెంబర్9 ప్రభాతవార్త :** మండలంలోని వెంకన్నపురం గ్రామంలో జరిగిన సమగ్ర అభివృద్ధి కార్యక్రమంల పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లకు రిటైర్డు కలెకటర్ ఏపీపీసీబీ ఛైర్మెన్ పి.క్రిష్ణయ్య ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి సత్కరించారు. ఆమెతో పాటు ఎంపిడిఓ వెంకటసుబ్బారావు, మండల వివిధశాఖల అధికారులు క్రిష్ణవేణి, వసంతకుమారి, విజయ లక్ష్మిలు పాల్గొన్నారు.

## డ్రగ్ నియంత్రణ కార్యాలయం ప్రారంభం



**కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త :** పట్టణంలోని ఐకాన్ సెంటర్ వెనుక వైపున డ్రగ్ నియంత్రణ అధికారి కార్యాలయాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో 900 మెడికల్ దుకాణాలు ఉన్నాయని వారు ఇచ్చే మందుల్లో ఎలాంటి లోపాలు ఉండరాదని తెలిపారు. అలాంటివి ప్రజలు గుర్తించి డ్రగ్ నియంత్రణ అధికారికి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. జంతువులకు ఇచ్చే మందులను కూడా ఎక్స్పైరీ డేట్‌ను చూసి ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మెన్ పోతుగంటి అలేఖ్య, మండల టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, సోమశీల మాజీ ఛైర్మెన్ మదుబాబునాయుడు, రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామక్రిష్ణ, టిడిపి సీనియర్ నాయకులు రామ్‌ప్రసాద్, తిరువిది ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కమిషనర్




**బుచ్చి డిసెంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మునిసిపల్ కమిషనర్ డి.బాలకృష్ణ మంగళవారం రెవిన్యూ విభా గంతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలో నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సి పాలిటీ పరిధిలో దీర్ఘకాలికంగా ఉన్న ఆస్తి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి వసూళ్ళును నూరు శాతం సాధించేలా కృషి చేయాలని రెవిన్యూ అధికారులు పంచాయితీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు సచివాలయ అడ్మిన్ కార్యదర్శలను కమీషనర్ ఆదేశించారు. టాక్స్ రివిజన్ సర్వే ద్వారా సేకరించిన డేటా మేరకు నూతన భవనాలను పన్ను పరిధిలోకి తీసుకోనిరావాలని, అదనపు అంతస్తులను పన్నులను విధించి ఖాళీ స్దలం పన్నులను విధించి, ఖాళీ స్దలం పన్నులను పూర్తి స్దాయిలో వసూలు చేయాలని సూచిం చారు. పన్నుల బకాయిలు ఉన్న అన్ని ఖాళీ స్దలాలో యజమానులకు సూచనలు జారీ చేస్తు నోటీసు బోర్డు లు ప్రదర్శించాలని ఆదేశించారు. దీర్ఘకాల పన్నులు బకాయిలు ఉన్న డబుల్ ఎంట్రీ, అన్అసెస్ట్, అండర్ అసెస్డ్ నాట్రేస్‌బుల్ అసెస్మెంట్ నెంబర్లను గుర్తించి రెవిన్యూ డేటాను పూర్తి స్దాయిలో పునరిద్దించాలని కమిషనర్ ఆదేశించారు.

## వరదయ్యతో మర్యాదపూర్వకంగా సోమిరెడ్డి భేటీ



**నెల్లూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త -వైద్యం** బీజేపీ సీనియర్ నాయకులు చిలుకోటి వరదయ్యతో నెల్లూరులోని లోటస్ హాస్పిటల్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డి తదితరులతో కలిసి వరదయ్య యోగక్షేమాలపై ఆరా. అప్పట్లో వరదయ్య తదితర పెద్దలతో కలిసి సారా వ్యతిరేక ఉద్యమంతో పాటు అనేక ప్రజా ఉద్యమాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న సోమిరెడ్డి.

## ఆర్ అండ్ బి రోడ్డు గురించి పట్టించుకోండి ఎమ్మెల్యే సార్!



**బిట్రగుంట డిసెంబర్ 9 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బోగోలు నుండి నాగులవరం వైపు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు ఇటీవల తుఫాను భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నది. ఈరోడ్డుమీద ప్రయా ణించే వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్రఅసౌకర్యంగా తయాయిం ది. ఇటీవల కోవూరుపల్లికి చెందిన ఇందుపూరు రామ్మోహన్ రెడ్డి దాతృత్వంతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టినప్పటికీ మరల తుఫాను, తదుపరి కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా గుంటలమయం అయిపోయింది. రాత్రుల సమయంలో వీదిదీపాలు సక్రమంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు గుంటల్లో పడి వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఎంతో కీలకమైన ఈ రహదారికి శాశ్వతంగా మరమ్మతులు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకట కృష్ణారెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి పెన్సింగ్ పోటీలు




### విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలి



**బుచ్చి డిసెంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెంలోని సెయింట్ మేరీస్ కళాశాల ప్రాంగణంలో అట్టహాసంగా 69 రాష్ట్రస్దాయి 14 సంవత్సరాల బాల బాలికల పెన్సింగ్ పోటీలు ప్రారంభమైయ్యాయి. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళీ మాట్లాడుతు విద్యార్ధులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. స్కూల్‌లో ఒక్క పిరిడ్ ఆటలకు కేటాయించాలని ఆమె సూచించారు. పి.డి భీమతాటి వెంకట రమణయ్య బుచ్చిరెడ్డిపాళెంలో ప్రతి సంవత్సరం, కొత్తకొత్త క్రీడలు పెట్టి బుచ్చిరెడ్డిపాళెం పేరు రాష్ట్ర నలుమూలల వ్యాప్తి చేస్తున్నారని ప్రశంసించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటువంటి క్రీడలకు పూర్తి స్దాయిలో తమ ప్రోత్సహం అందిస్తుంటారని అన్నారు. వా రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పిల్లలు క్రీడాస్పూర్తితో ఆట లు ఆడాలని గెలుపు అనేది తప్పకుండా వస్తుం దన్న ఆత్మవిశ్వాసంతో ఆడాలని ఆమె సూచించారు. అనంతరం టిడిపి టౌన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు మాట్లాడుతు బుచ్చిరెడిపాళెంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తు రాష్ట్రస్దాయి పెన్సింగ్ పోటీలు



ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వా హకులను అభినందించారు. అనంతరం ఎంఇఓ దిలీప్ కుమార్ మాట్లాడుతు క్రీడల వల్ల ఆత్మస్తైర్యం పెరుగుతుందని అన్నారు. క్రీడలలో రాణిస్తే ఆ కోటాలో ఉద్యోగాలు కూడా సంపాదించుకోవచ్చునని అన్నారు. సీనియర్ నాయకులు ఎంవి శేషయ్య మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం క్రీడాకారులకు పుట్టినిల్లు అని అన్నారు. మొదటి నుండి కూడా బుచ్చిలో క్రీడాకారులు రాష్ట్రస్దాయిలో విజేతలుగా నిలిచారని ఆయన గుర్తు చేశారు. పి.డి భీమతాటి వెంకటరమణయ్య క్రీడల పట్ల చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఈక్రీడలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, టౌన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, నాయకులు చింతంశ్రీనివాసులురెడ్డి, ఎంఇఓ దిలీప్‌కుమార్, ఎంఇఓ-2 రత్నం, నెల్లూరు జిల్లా స్కూల్‌గేమ్స్ పెడరేషన్ సెక్రటరీ ఎం.దేవిక, భీమతాటి వెంకటరమణయ్య, దామరమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒ.వెంకటేశ్వర రావు, ప్రిన్సిఫల్‌సాగర్, పిడి మధు, నంద్యాల ఎస్‌జిఎస్ ఆశాజ్యోతి, భవానీ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోభాగంగా అతిధులకుఘ నంగాసన్మానించారు. ఈ పోటీలో 13జిల్లాల నుం డిక్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు

## సంఘ సమావేశాలు పొదుపుకు ప్రాణం వంటివని - డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి






**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 9, ప్రభా త వార్త** జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నెల్లూరు జిల్లా సమాఖ్య కార్యవర్గ సమా వేశం జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలో జి ల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి జిల్లాలోని 37 మండల సమా ఖ్య అధ్యక్షులు హాజ రైయ్యారు. ఈ కార్యక్రమానికి డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి నాగరాజ కుమారి హాజరై మాట్లాడుతూ పొదుపు ఉద్యమం పుట్టింది మన నెల్లూరు జిల్లాలోనే, ఈ పొదుపు అనే మహా వృక్షాన్ని జాగ్రత్తగా కాపాడుకోవలసిన భాధ్యత మన అందరి మీద ఉందని సంఘ సమావేశాలు పొదుపుకు ప్రాణం వంటివని. క్రమం తప్పని సమావేశాలు జరుపుకొని సభ్యులు అప్రమత్తంగా ఉండిన యెడల పొరపాటు జర గకుండా నిధులు దుర్వినియోగం కాకుండా చూసుకొనవచ్చునని. రికవరీలు లేని సంఘాల మనుగడ కష్టం అవుతుందని, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి మరియు సిఐఎఫ్ రీపేమెంట్లు 100 శాతం ఉండేటట్లు చూసు కోవాలి తదుపరి నిధి మీటింగు నాటికి మీ మండలాలలో రికవరీ గురించి ప్రతి సభ్యురాలు మాట్లా డవలెను. ప్రతి సభ్యురాలు తన కుటుంబంతో పాటుగా కొంత సమయంను సంఘాలకు కేటాయించవలెను. మన సంస్థల పుస్తక నిర్వహణ, ఎం. బుక్ కీపింగ్ సక్రమంగా నిర్వహించుకోవలనరు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల వివిద రకాల జీవనోపాదుల పథకాలను వినియోగించుకొని సభ్యుల కుటుంబ ఆదాయం పెంపొందిం చుకొనవలేనని ప్రాజెక్టు డైరెక్టర్ తెలియజేశారు. అంతే కాకుండా వెంకటాచలం నందు మగ్గం శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయబడినదని, 30 మంది సభ్యులు కలసి శిక్షణ తీసుకొనుటకు ముందుకు వస్తే వారు కోరిన అంశములలో ఇతర మండలములలో శిక్షణ ప్రారంభిచవచ్చును అని ప్రాజెక్టు డైరెక్టర్ తెలియజేశారు. కావలి మండలములో మిల్లెట్ వంటకముల మీద త్వరలో శిక్షణా కార్యక్రమం ప్రారంభం అవుతుందని దగ్గర మండలంలోని సభ్యులు ఈ శిక్షణకు హాజరయ్యి మిల్లెట్‌తో కూడిన వంటకములు నేర్చు కొనవలెనని ప్రాజెక్టు డైరెక్టర్ సభ్యు లకి తెలియజేశారు. ఎఫ్‌పిఓల సేవలను ఉపయోగించుకొని స్ప్రేయర్లు, స్ప్రేయర్లు, రోటో వెటర్లు మరియు పట్టలు తక్కువ దరకు కొనుగోలు చేసి ఉపయోగించుకోవచ్చునని తెలియజేశారు. పండ్ల తోటలు సాగు చేసే సభ్యులు సోలార్ డ్రైయర్‌లను ఉపయోగించుకొని ఎక్కువ లాభం పొందవచ్చును. డైరీ ఫార్మ్ కలిగి ఉన్న సభ్యులుపెరుగు, నెయ్యి వంటి బై ప్రొడెక్ట్‌ను తయారు చేసి ఆదాయం పొందవచ్చును అని తెలియజేశారు. తదుపరి లింగవివక్షత పై సభ్యులకు అవగాహన కల్పించి జెండర్ ప్రతి జ్ఞను సభ్యులతో పలికించారు.

## మెడికల్ అంకాలజీ.. క్యాన్సర్ చికిత్సలో సమ్మ విధానం

### - మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మౌనిక




**నెల్లూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త -వైద్యం** మెడికల్ అంకాలజీ అనేది క్యాన్సర్ చికిత్సలో ప్రత్యేకత కలిగిన వైద్య విభాగం. ఇది క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స, నివారపై దృష్టిసారిస్తుంది. ప్రధానంగా కీమోథెరపి, టార్గెటెడ్‌థెరపీ, ఇమ్యునోథెరపీ, హార్మోన్ తెరపీ వంటి మందుల అథారిటి చికిత్సా విధానాలను ఉపయోగిస్తుంది.

**మెడికల్ ఆంకాలజిస్ట్ పాత్రః** ఒక మెడికల్ అంకాలజిస్ట్ క్యాన్సర్ రోగుల చికిత్సా ప్రణాళికను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తారు.

**వారి ప్రధాన విధులుః** క్యాన్సర్ నిర్ధారణ, దశను గుర్తించడం. రోగి యొక్క క్యాన్సర్‌రకం, దశ, సాధారణ ఆరోగ్యం, వ్యక్తిగత అవసరాల ఆధారంగా సరైన చికిత్సా విధానాన్ని సిఫార్సు చేయడం. కీమో థెరపి, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ, హార్మోన్ థెరపీ వంటి మందుల ఆధారిత చికిత్సలను నిర్వహించడం. శస్త్రచికిత్స లేదా రేడియేషన్ థెరపీ వంటి ఇతర చికిత్సా నిపుణులతో కలిసి రోగికి స మగ్ర చికిత్సనుఅందించడం. చికిత్స సమయంలో తలెత్తే దుష్ప్రభావాలను పర్యవేక్షించడం, నిర్వహిం చడం. చికిత్స తర్వాతరోగికి నిరంతర సంరక్షణ, పర్యవేక్షణ అందించడం.

**మెడికల్ ఆంకాలజీలో చికిత్సా విధానాలుః కీమో థెరపిః** ఇది క్యాన్సర్ కణాలను చంపడానికి లేదా వాటి పెరుగుదలను ఆపడానికి శక్తివంతమైన మందులను ఉపయోగించేచికిత్స. ఈ మందులను నోటి ద్వారా లేదా ఇంజెక్షన్ల ద్వారా ఇస్తారు. కీమో థెరపి క్యాన్సర్ కణాలతో పాటు కొన్ని ఆరోగ్య కరమైన కరణాలను కూడా ప్రభావితం చేస్తుంది. దీని వల్ల వికారం, వాంతులు, జుట్టు రాలడం, అలసట, రక్త కణాల సంఖ్య తగ్గడం వంటి దుష్ప్రభావాలు కలుగుతాయి. అయితే, ఈ దుష్ప్రభావాలను తగ్గించడానికి ఇప్పుడు సమర్థవంతమైన మందులు అందుబాటులో ఉన్నాయి.

**టార్గెటెడ్ థెరపీ(లక్షిత చికిత్స)ః** ఈ చికిత్స క్యాన్సర్ కణాలలో ప్రత్యేకమైన అణువుల ను(మ్యుటేషన్లు)లక్ష్యంగా చేసుకుంటుంది. ఇదిఆరోగ్యక రమైన కణాలపై తక్కువ ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి కీమోథెరపి కంటే తక్కువ దుష్ప్రభావాలను కలిగి ఉంటుంది.

**ఇమ్యునోథెరపీ(రోగ నిరోధక శక్తి ఆధారిత చికిత్స)ః** ఈ విధానం రోగి యొక్క స్వంత రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి, క్యాన్సర్ కణాలను గుర్తించి, నాశనం చేయడానికి సహాయపడుతుంది. ఇది ఇటీవల సంవత్సరాలలో క్యాన్సర్ చికిత్సలో గణనీయమైన పురోగతిని సాధించింది.

**హార్మోన్ థెరపీః** రొమ్ము లేదా ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్లు హార్మోన్లపై ఆధారపడి పెరుగుతాయి. హార్మోన్ థెరపీ ఈ హార్మోన్ల ఉత్పత్తిని నిరోధించడం లేదా వాటి ప్రభావాన్ని తగ్గించడం ద్వారా క్యాన్సర్ పెరుగుదలను ఆపుతుంది.

**భారతదేశంలో మెడికల్ ఆంకాలజీ అభివృద్ధిః** పురోగతిని సాధిస్తోంది. అత్యాధునిక చికిత్స విధానాలు, అధునాతన మందులు, సుశిక్షితులైన వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తున్నారు. పరిశోధన, అభివృద్ధిలో పెట్టుబడులు పెరగడం వల్ల, కొత్త చికిత్సలు, వ్యక్తిగత వైద్యం(పర్సనలైజ్డ్ మెడిసిన్) వైపు దృష్టి సారించడం జరుగుతోంది. ఏ1(కృత్రిమ మేథస్సు) వంటి సాంకేతికతలు కూడా క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స ప్రణాళికలో సహాయపడుతున్నాయి. అయినప్పటికి ప్రజల్లో అవగాహన పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాలకు చికిత్సా సౌకర్యాలను విస్తరించడం వంటి సవాళ్లు ఇంకా ఉన్నాయి. క్యాన్సర్ నిర్ధారణ అయినప్పుడు, మెడికల్ ఆంకాలజిస్ట్ సూచనల మేరకు చికిత్స తీసుకోవడం, చికిత్స సమయంలో దుష్ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కోవడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని అనుసరించడం చాలా ముఖ్యం.

## కోటి సంతకాల సేకరణ విజయవంతం" కాకాని




**నెల్లూరు, డిసెంబర్ 9, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాసనమం డలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీ వయ్య, నెల్లూరు రూరల్ ఇంచార్జీ ఆనం విజయకుమార్ రెడ్డి , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతు మా పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో కందుకూరు నియో జకవర్గంతో సహ (11 నియోజకవ ర్గాలలో) మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నియోజకవర్గ ఇన్చార్జీల ఆధ్వర్యంలో మహా యజ్ఞంలా సాగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాలు, విద్యార్థుల తల్లితండ్రులు, ప్రజా సంఘాలు, మేధావులు, విద్యావేత్తలకు అందరికీ కృతజ్ఞతలు.. సేకరిం చిన కోటి సంతకాలను డిసెంబర్ 10వ తేదీని యోజవర్గ కేంద్రాల నుండి ఊరేగింపుగా వైయస్సార్సీపీ జిల్లా కార్యాలయానికి చేరుస్తాం. డిసెంబర్ 15వ తేదీన, 11 నియోజకవర్గాలకు సంబంధించి కోటి సంతకాలకు సంబంధించిన ప్రతులను గాంధీ బొమ్మసెంటర్ నుండి ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించి, డాబి.ఆర్. అంబే ద్కర్ విగ్రహం దగ్గర ముగింపు సభ నిర్వహిం చడం జరుగుతుంది. డిసెంబర్ 17వ తేదీ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో సేకరించిన కోటి సంతకాలను రాష్ట్ర గవర్నర్‌కి అందించి మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతాం. కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం విజయవంతం కావడంతో చంద్రబాబుకు, కూటమి నేతలకు కడుపు మండిపోతుంది. ఇండిగో వ్యవహారంలో వార్ రూం నిర్వహించామని చెప్పుకొని తెలుగుదేశం నవ్వులు పాలైంది.. కూటమిలోని భాగస్వామ్య పార్టీలు కూడా మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాతో కలిపి నడిచారు. కరుడు గట్టిన టిడిపి పార్టీకి సంబంధించిన వ్యక్తులు కూడా కోటి సంతకాలు సేకరణకు కొందరు నేరుగా, మరికొం దరు పరోక్షంగా సంతకాలు పెట్టి మద్దతు తెలిపారు.. కోటి సంతకాలు సేకరణ కార్యక్రమానికి మద్దతు తెలిపి, విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పేరుపేరున హృదయపూర్వక ధన్యవాదాలు.

**ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతు** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలని జగన్మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 50 రోజులుగా విజయవంతంగా జరుగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో సంతకాల సేకరణ అనుకున్న దానికంటే ఎక్కువగాసేకరించాం. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నుండి 60 వేల సంతకాలు సేకరించాలని లక్ష్యంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో అనుకున్న దానికంటే ఎక్కువ సంతకాలు సేకరించాం. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో అన్ని పార్టీలు ముందుకు వచ్చి సంతకాలు చేసి, విజయవంతం చేయడం హర్షణీయం. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం కావడం చంద్రబాబు ప్రజావ్యతిరేక నిర్ణయాలకు చెంపపట్టు లాంటిది. నెల్లూరు నగర నియోజవర్గంలో డిసెంబర్ 10వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని, విజయవంతం చేయాలని కోరుతున్నాం.

**మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతు** పేదవారికి వైద్య విద్య అందించాలనే ఉద్దేశ్యంతో మాజీ ముఖ్య మంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు పూనుకున్నారు.. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను స్థాపిస్తే, వైద్య విద్యతో పాటు, పేద వారికి వైద్యం కూడా అందుతుంది. ప్రభుత్వ మె డికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పప్పు, బెల్లంకు అమ్మేయాలని చూస్తుంది. మెడికల్ కాలేజీలు ప్రైవే టీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంకు ప్రజల నుండి స్పందన వచ్చిం ది. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్వహించాలి అని కోరుతు న్నారు.. నియోజవర్గంలో చేసిన సంతకాల సేకరణ జిల్లా కేంద్రంకు తీసుకు వచ్చి ఈ నెల 15 న ర్యాలీ చేపడుతాం. ప్రజలు వ్యతిరేకిస్తున్నా, చంద్రబాబుకు చలనం కూడా లేకుండా, మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నాడు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు..

**నెల్లూరు రూరల్ ఇంచార్జీ ఆనం విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతు** మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరంకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి అనుకున్న దానికంటే ఎక్కువ విజయవంతమైంది.. రూరల్ నియోజకవర్గంలో సేకరించిన సంతకాలను ఊరేగింపుగా తీసుకొనివచ్చి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి అందిస్తాం.. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం ఆపాలని మాఅధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.. రూరల్ నియోజకవర్గంలో కోటిసంతకాల సేకరణ విజయవంతంచేసిన నాయకులు, కార్యకర్తలు అందరికీ కృతజ్ఞతలు

## నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ పూర్తి



**కావలి, డిసెంబర్9 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేస్తున్నందున నిరసనగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగ న్మోహన్‌రెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కావలి నియోజకవర్గంలో పూర్తియిన సందర్బంగా వైసిపి కార్యాల యంలో స్థానిక విలేకర్ల సమావేశంలో వైసిపి నేతలు మాట్లాడారు. వైసిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. సేకరించిన సంతకాలను వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డికి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 16న జగన్ సమక్షంలో గవర్నర్‌కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్న ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, కావలి రూరల్ మండల కన్వీనర్ వాయిల తిరుపతి, మాజీ కౌన్సిలర్ గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చిన్నపుల్లయ్య, మూడవ వార్డు ఇన్‌చార్జ్ మండలి క్రిష్ణారావు, వైకాపా నాయకులు షాహుల్, నాయిబ్ రసూల్, తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు

## సోంత నిధులతో గిరిజన కాలనీ రోడ్డుకు మరమత్తులు



**గోనుపల్లి(రాపూరు), డిసెంబరు 9ప్రభాతవార్త** మండలంలోని గోనుపల్లి గ్రామంలోని బోంతలసంఘం(ఎస్టీ)కాలనీకి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయుడు ఈగా రాజా రెడ్డి తన సోంత నిధులతో మరమత్తులు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బాగా దెబ్బతిన కాలనీ వాసులు రాకపోకలకు ఎంతో ఇబ్బంది కరంగా మారింది. దీంతో రాజా రెడ్డి తన సోంత నిధులను వెచ్చించి ఈ రోడ్డుకు వున్న గుంతలకు గ్రావెల్‌ను తోలించి చదరపెట్టించారు. దీంతో ఈ రోడ్డు చక్కగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా తయారయ్యింది. కాలనీకి సోంత నిధులతో రోడ్డు మరమత్తులు చేయించిన రాజా రెడ్డి దాతృత్వాన్ని ఆ కాలనీ వాసులు కోనియాడుతున్నారు.